

# అభద్రత భావం కల్పించే వారిపై కఠిన చర్యలు

**- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ**

**విశ్వంభర,సూర్యాపేట:** సూర్యాపేట జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ నరసింహ హెచ్చరించారు. సమాజంలో అభద్రతా భావాన్ని సృష్టించే వారిపై, ఇరు వర్గాల దాడులు, మద్యం మత్తులో దాడులకు పాల్పడే యువతపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టాం, కఠిన చర్యలు తీసుకుంటాం అని ఆయన స్పష్టం చేశారు, నాన్ బెయిలబుల్ వారెంట్స్ తో జైలుకు పంపడం, రౌడీ షీట్స్ నమోదు చేసి ప్రతి నెలా పోలీస్ స్టేషన్ కు పిలిచి కౌన్సిలింగ్ చేస్తాం. ప్రజలను ఇబ్బందులకు గురి చేసినా, సమాజంలో అభద్రతా వాతావరణం కల్పించిన అలాంటి వారిని ఉపేక్షించం, చట్టాన్ని ఉల్లంఘిస్తే కోర్టుల చుట్టూ, పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సినదే అన్నారు. సందర్భాన్ని తీవ్రతను బట్టి ఫ్రెండ్లీ పోలీసింగ్ పక్కన బెట్టి చట్టానికి పని చెప్తాం అని హెచ్చరించారు. పాత నేరస్తులు, తీవ్రమైన కేసుల్లో ఉన్న నిందితుల పై నిఘా ఉన్నది ఎక్కడ తిరుగుతున్నారు అనేది పరిశీలించడానికి వ్యక్తిగత వివరాలు, ఫోన్స్ జియో టాగింగ్ చేసి ప్రత్యేక బీట్ బృందాలతో పర్యవేక్షణ చేస్తున్నాం. కాలనీల్లో రోడ్ల వెంట అడ్డాల చేసుకుని ఇబ్బందులు పెడుతున్న ఆకతాయిల సమాచారాన్ని ఫోటోలు, విడియోలు తీసి 8712686026 కు పోలీసు వారికి సమాచారం ఇవ్వండి వివరాలు గోప్యంగా ఉంచుతాం. ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటాం.

# చిన్ననాగారం ముత్యాలమ్మ తల్లికి ఘనంగా బోనాలు



**విశ్వంభర,ఇనుగుర్తి/నెల్లికుదురు:** ఇనుగుర్తి మండలం చిన్ననాగారంలోని కోరిన కోరికలు తీర్చే మహిమాన్విత శ్రీ ముత్యాలమ్మ తల్లికి, నెల్లికుదురు మండలం మేచరాజు పల్లి గ్రామస్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో బుధవారం ఘనంగా బోనాలు చేశారు. ఎడ్లబండ్లు,ఆటోలు,ట్రాక్టర్లు, కార్ల లో భక్తులు తరలివచ్చి దేవస్థానం చుట్టూ కుటుంబాల సమేతంగా ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి పట్నాలు వేసి అనంతరం శివశక్తుల పూనకాల జోరు,డప్పు చప్పుళ్ల హోరులో మహిళలు సామూహికంగా బోనాలను ఎత్తుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి లోకపావనులైన శ్రీ ముత్యాలమ్మ, మారమ్మ,పెద్దమ్మ,లోతుగుంట మైసమ్మ తల్లులకు బోన నైవేద్యాలను సమర్పించారు. కోళ్లు,పొట్టేళ్ల తో మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామాలు కళకళ లాడుతూ అష్ట,ఐశ్వర్య, ఆయురారోగ్యాలతో ఉండాలని జగజ్జననిలను వేడుకున్నారు.ఈ సందర్భంగాముత్యాలమ్మ తల్లి భక్తులు కారోబారు దూబర్ల సాయిలు, గొడుగు వెంకన్న,పెద్ద బోయిన వెంకన్న,దొడ్ల తిరుపతి, నక్క హరీష్,వరుణ్,రవికుమార్ తదితరులు మాట్లాడుతూ ఏటా ముత్యాలమ్మ తల్లికి వర్షాకాలం ముందు బోనాల జాతర నిర్వహిస్తామని, ఈ క్రమంలో అమ్మవారికి బోనాలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు.

# ఆకట్టుకున్న సాయి వేద్ ప్రదర్శన




**విశ్వంభర, హైదరాబాద్ :** బాల మాంత్రికుడిగా సాయి వేద్ చూపిన ప్రతిభ విశేషమని అతిథులు ప్రశంసించారు. హైదరాబాదు చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గాన సభలో నిర్వహించిన మెజిక్-మిమిక్రీ-మైమ్ సమ్మేళనం 3ఎం ఫెస్టివల్‌లో ఆరు సంవత్సరాల మాస్టర్ సాయి వేద్ తన అద్భుత ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. పుణెకు చెందిన ఈ బాలుడు మ్యాజిక్‌తో పాటు మిమిక్రీ, మైమ్ అంశాలను సమన్వయం చేస్తూ ప్రత్యేక గుర్తింపు పొందాడు. ప్రముఖ మాంత్రికుడు రఘుబాబు కుటుంబానికి చెందిన వేద్, ఇటీవల పుణెలో జరిగిన జాతీయ స్థాయి మ్యాజిక్ కన్వెన్షన్‌లో కూడా ప్రదర్శన ఇచ్చి ప్రశంసలు అందుకున్నాడు. మాంత్రిక రంగంలో ప్రతిభ చూపుతున్న రమ్యశ్రీ మార్గదర్శకత్వంలో శిక్షణ పొందుతున్నాడు. ఈ ఫెస్టివల్‌లో సాయంత్రం కార్యక్రమాలు జూన్ 21 వరకు కొనసాగనున్నవి. కళారంగ అభివృద్ధి, వినోదంతో పాటు ప్రతిభ ప్రోత్సాహం లక్ష్యంగా కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో: తెలంగాణ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి డా. కె.వి. రమణాచారి, ప్రముఖ రచయిత పి.వి. శ్రీనివాసరావు, కళా జనార్దన మూర్తి, చెక్కపు వెంకటరమణ, మోహన్ శ్రీవత్స, మైమ్ మధు, చొక్కాపు వెంకటరమణ, డా. జయకుమార్, డా. జి.వి.ఎన్. రాజు, మల్లెల రమేష్, రాజుబాబు సునీల్, భావాని శివ తదితరులు పాల్గొన్నారు.

# గృహ కార్మికులకు చట్టం తీసుకురావాలి




**విశ్వంభర, హైదరాబాద్ :** గృహ కార్మికుల సమగ్ర సంక్షేమం, సామాజిక భద్రత కోసం ప్రత్యేక చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూపొందించాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అంతర్జాతీయ గృహ కార్మికుల దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాదు బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి లేక పట్టణాలకు వలస వచ్చిన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గిగ్ కార్మికులకు చట్టం చేసినట్లే గృహ కార్మికులకు కూడా చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మానవ హక్కుల వేదిక సమన్వయకర్త జీవన్ కుమార్ మాట్లాడుతూ గృహ కార్మికులను కార్మికులుగా గుర్తించాలని కోరారు. ప్రభుత్వాలు స్పందించడం లేదని విమర్శించారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్ మాట్లాడుతూ కనీస వేతనాలు, నివాస సదుపాయం కల్పించాలని, ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. హైదరాబాదు జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పులి కల్పన మాట్లాడుతూ గృహ కార్మికులపై వేధింపులు ఆపాలని అన్నారు.ఈ కార్యక్రమంలో రాజేష్, కృష్ణ, యాదమ్మ, శారద, మీనా, రంగమ్మ, సుధాకర్, రవి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ నాయకులు సహకరించాలి

**○ కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**




**విశ్వంభర, సూర్యాపేట :** రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ, ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని వివరించారు. జూన్ 25 జూలై 24వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని, 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు. జూలై 24 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు. ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. వలస వెళ్లిన వారు, మరణించిన వారు, మరియు డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం, ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు.

ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫామ్6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ అయిన 01102026 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు. ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.


కార్యక్రమం లో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి డి. ప్రేమ్ రాజ్, రాజేశ్వర్ రావు, అంజాద్, ఐ ఎన్ సి, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ బిఆర్ఎస్, బి జె పి అబిద్, గోపి సి పి ఐ (ఎం) స్టాలిన్ బి ఎస్ పి తదితరులు పాల్గొన్నారు.

# బ్రతుకులనే బలితీసుకుంటున్న గౌడ వృత్తి



**విశ్వంభర , కేసముద్రం :** కేసముద్రం మండలంలో వరుసగా జరుగుతున్న గీత కార్మికుల ప్రమాదాలు గౌడ కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని గోపా డివిజన్ అధ్యక్షుడు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. బ్రతుకుదెరువు కోసం చేపట్టిన గౌడ వృత్తి నేడు బ్రతుకులనే బలి తీసుకుంటోందని అన్నారు. కుటుంబ పోషణ కోసం ప్రాణాలను పణంగా పెట్టి తాటి చెట్లను నమ్ముకొని జీవనం సాగిస్తున్న గౌడన్నలు అదే తాటి చెట్ల కారణంగా ప్రాణాలు కోల్పోతుండటం అత్యంత బాధాకరమన్నారు.తమ భర్తలు పొద్దున వృత్తి రీత్యా బయటకు వెళ్లిన వాళ్ళు తిరిగి నవ్వుతూ ఇంటికి వచ్చే వరకు తాళి చేతిలో పట్టుకొని చూసే వాళ్ళ ఎదురుచూపులు మాటల్లో వర్ణించలేనివని ఆవేదన వ్యక్తం చేసారు..గత కొద్ది రోజుల వ్యవధిలోనే కేసముద్రం మండలంలో చోటుచేసుకున్న వరుస ప్రమాదాలు పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో తెలియజేస్తున్నాయన్నారు. కేసముద్రం గ్రామానికి చెందిన ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కావడంతో పాటు మెదడులో రక్తం గడ్డకట్టిందని, చేతులు, కాళ్లు విరిగిపోయి ప్రస్తుతం హన్మకొండలోని ఆసుపత్రిలో ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. అలాగే ఇంటికన్నె గ్రామానికి చెందిన సార రాజు తాటిచెట్టుపై నుంచి కిందపడటంతో వెన్నెముక, పక్కటెముకలు విరిగి తీవ్ర గాయాలపాలై మంచానికే పరిమితమై చికిత్స పొందుతున్నారని అన్నారు.ఇక తాజాగా కల్వల గ్రామానికి చెందిన వేముల మల్లేశం తాటిచెట్టుపై నుంచి జారిపడి మృతి చెందడం గౌడ సమాజాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. ఘటన జరిగిన వెంటనే సమాచారం అందుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన ఆయన, పంచనామా ప్రక్రియ పూర్తయ్యే వరకు అక్కడే ఉండి కుటుంబానికి అండగా నిలిచారు. కుటుంబ పోషణ కోసం పనికి వెళ్లిన వ్యక్తి తిరిగి శవంగా ఇంటికి చేరడం హృదయ విదారకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సమ్మయ్య గౌడ్, మోడెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, "ఉదయం కుటుంబం కోసం పనికి వెళ్లిన గౌడన్న సాయంత్రానికి క్షేమంగా ఇంటికి చేరుతాడో లేదో తెలియని పరిస్థితి ఏర్పడింది. ప్రకృతి ఇచ్చిన తాటి చెట్టును నమ్ముకొని తరతరాలుగా జీవిస్తున్న గౌడన్నలు, నేడు అదే తాటి చెట్లపై ప్రాణాలు కోల్పోతున్నారు. పూట గడవాలంటే చెట్టు ఎక్కాలి... ప్రాణం దక్కాలంటే అదృష్టం ఉండాలి అనే పరిస్థితి గౌడ కుటుంబాలను వెంటాడుతోందని ఆవేదన వ్యక్తం చేసారు..మృతి చెందిన వేముల మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుటుంబ సభ్యులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కొరారు.. అలాగే ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్న ఉట్కూరి శ్రీనివాస్ గౌడ్ మరియు సార రాజులకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా తోపాటు వైద్య ఖర్చులను పూర్తిగా ప్రభుత్వం భరించి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రతి గీత కార్మికుడికి నాణ్యమైన సేఫ్టీ బెల్టులు, భద్రతా పరికరాలు, ప్రమాద బీమా, ఆరోగ్య బీమా అందించాలని డిమాండ్ చేశారు. తాటి చెట్లు ఎక్కే కార్మికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని కోరారు. తాటి చెట్ల ఎత్తును తగ్గించే విధానాలతో పాటు ఆధునిక గీత పద్ధతులను ప్రోత్సహించాలని సూచించారు.గౌడ సంఘం తరపున గ్రామ గ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రతి గీత కార్మికుడు భద్రతా పరికరాలను తప్పనిసరిగా వినియోగించేలా చైతన్యం తీసుకువస్తామని చిలువేరు సమ్మయ్య గౌడ్ తెలిపారు. గౌడ కుటుంబాల భద్రత కోసం సంఘం ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.

# విద్యుత్ ప్రమాద బాధితులకు చెక్కుల పంపిణీ



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** నారాయణఖేల్ నియోజకవర్గ పరిధిలో విద్యుత్ ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 45 లక్షల 88 రూపాయలకు చెక్కులను నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ రెడ్డి పంపిణీ చేశారునారాయణఖేడ్ మున్సిపల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విద్యుత్ ప్రమాద బాధితులకు టీజీఎస్ పిడిసిఎల్ఆధ్వర్యంలో మంజూరైన పరిహారం చెక్కులను * బుధవారం పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2018 నాటి నుండి 2023 వరకు విద్యుత్ ప్రమాదాలకు గురైన బాధితులను, వారి కుటుంబాలను పట్టించుకున్న నాయకుడే లేడని విమర్శించారు. గత పాలకులు బాధితుల ఆర్తనాదాలను పూర్తిగా బేఖాతరు చేశారని ఎమ్మెల్యే మండిపడ్డారు.,రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఈ పెండింగ్ సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించానని ఎమ్మెల్యే తెలిపారు. బాధితులకు న్యాయం చేయాలనే సంకల్పంతో స్వయంగా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో నిరంతరం మాట్లాడి, ప్రత్యేక చొరవ తీసుకొని చెక్కులను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని ఆయన వివరించారు.మనుషులు (ప్రాణ నష్టం/బాధితులు): 4 గురు బాధితులకు గాను రూ.20,00,000 (20 లక్షల రూపాయలు)పశువులు: 64 మంది లబ్ధిదారులకు గాను రూ.25,60,000 (25 లక్షల 60 వేల రూపాయలు)మేకలు : బాధితులకు ₹47,000 (47 వేల రూపాయలు) చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం గాను రూపాయలు 4588000 రూపాయలు లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడమే మా ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమ ని నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రజా సంక్షేమం కోసం నేను ఎల్లప్పుడూ ముందుంటాను అన్నారు.ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కుల పంపిణీ




**విశ్వంభర, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు అండగా నిలిచేందుకు సూరారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోట్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి ఎంఈఓ మరియు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జిహెచ్ఎం మెతుకు పురుషోత్తం రెడ్డి విచ్చేసి, తన చేతుల మీదుగా విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ. విద్యార్థులు విద్యాసంవత్సరం మొదటి రోజు నుంచే ఈ పుస్తకాలను సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదవాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యమని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి పాఠశాలకు, తమ తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు నిరంతరం కృషి చేస్తున్న ఎంఈఓ & జిహెచ్ఎం కు పాఠశాల ఉపాధ్యాయ బృందం, సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది. వారికి సకాలంలో పుస్తకాలు అందించడం ద్వారా వారి చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూసుకోవచ్చు.ఈ కార్యక్రమంలో పాఠశాలఎంఈఓ ప్రధానోపాధ్యాయులు మెతుకు పురుషోత్తం రెడ్డి, ఉపాధ్యాయులు రవీందర్, సతీష్, వెంకటేశ్వర్లు, కవితా, కార్తీక్, మనోహర, దేవి, మేరీభాయి, సునీల్, మధుకరు రెడ్డి, అనిత లతా, చంద్రమౌళి, నగేష్, గోపికృష్ణ, ఎల్లయ్య, నదీమ్ తదితరులు పాల్గొన్నారు.




# బాలాలయంలో విగ్రహాల ప్రాణ ప్రతిష్ఠ

**విశ్వంభర, మహాదేవపూర్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ కార్యక్రమంలో భాగంగా బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈఓ) ఎస్. మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి పూలు, పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శృంగేరి జగద్గురువుల ఆశీస్సులతో వచ్చిన శిష్యబృందం, తొమ్మిది మంది వేద పండితుల ఆధ్వర్యంలో మహా గణపతి పూజ అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో పంచబ్రహ్మ హోమం, శాంతి పూజలు, ప్రాయశ్చిత్త హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే విజయ గణపతి, పార్వతి (శుభానంద) మాత, మహా సరస్వతి మాత, సుబ్రహ్మణ్య స్వామి ఆలయాల్లోనూ పూజలు నిర్వహించి, పంచలోహ బింబాలలో ప్రాణప్రతిష్ఠ చేపట్టారు. శృంగేరి పీఠాధిపతి శ్రీ విధుశేఖర భారతీ స్వామివారు బాలాలయ పూజల నిమిత్తం పంపించిన కాళేశ్వర ముక్తీశ్వర స్వామివారి చిన్న లింగాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బాజాభజంత్రులు, వేదమంత్రోచ్చారణల మధ్య ప్రధాన అర్చకులు నగేష్ శర్మ ఆధ్వర్యంలో ఐదుగురు అర్చకులు కళశాలను ఊరేగింపుగా తీసుకెళ్లి, ఆదిముక్తీశ్వర స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బాలాలయ మండపంలో శృంగేరి పీఠ శిష్యబృందం చేత ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎస్. మహేష్, దేవస్థానం చైర్మన్ మోహన్ శర్మ, ధర్మకర్తలు సత్యనారాయణ, సీతయ్య, శ్యామ్ సుందర్, సీతారాం, దుర్గయ్య, అశోక్, పద్మ, రాజయ్య, ప్రశాంత్ రెడ్డి, శ్రీధర్ రావు, సత్యం తదితరులను శృంగేరి పీఠం శిష్యబృందం సన్మానించి, ఆశీర్వదించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు



**విశ్వంభర, చేవెళ్ల :** ఓటరు జాబితాల ప్రత్యేక సమీక్ష (ఎస్ఐఆర్) ప్రక్రియపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దని బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డా. వైభవ్ రెడ్డి అన్నారు.బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ అనేది భారత ఎన్నికల సంఘం ఎన్నో సంవత్సరాలుగా నిర్వహిస్తున్న సాధారణ ఎన్నికల ప్రక్రియలో భాగమని తెలిపారు. అర్హులైన ప్రతి భారతీయ పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, మరణించిన వారి పేర్ల తొలగింపు, డబుల్ ఓట్ల నివారణ, ఓటరు వివరాల సవరణ వంటి అంశాల కోసం ఈ ప్రక్రియ నిర్వహించబడుతుందని వివరించారు.ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్ఐఆర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సంఘం అధికారులు ఇంటింటికీ వచ్చినప్పుడు ప్రజలు అవసరమైన వివరాలు సమర్పించి తమ ఓటు నమోదును నిర్ధారించుకోవాలని కోరారు.అర్హులైన భారతీయ పౌరుల ఓటు హక్కును పరిరక్షించడం, అనర్హులు ఓటరు జాబితాలో చేరకుండా చూడడమే ఎస్ఐఆర్ ప్రధాన లక్ష్యమని డా. వైభవ్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి అర్హుడైన పౌరుడు తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని, ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.